సాక్షి సిద్దిపేట

గురువారం ⋅ 16 ⋅ నవంబర్ ⋅ 2023

దుబ్బాక గడ్డ..



రాష్ట్ర వ్యాప్తంగా సంచలనాలకు కేంద్రబిందువుగా నిలిచింది దుబ్బాక. విప్లవోద్యమాలకు .. తెలంగాణ ఉద్యమానికి కీలకభూమిక పోషించింది. వివరాలు 10లో ▸



లిక్కర్ తెలంగాణగా మార్చిండు

లిక్కర్ తెలంగాణగా మార్చిన కేసీఆర్ ప్రభుత్వానికి ప్రజలు ఈ ఎన్నికల్లో కర్రుకాల్చి వాతపెట్టాలని దుబ్బాక బీజేపీ అభ్యర్థి రఘునందన్ రావు అన్నారు. వివరాలు 10లో ▸



బీఆర్ఎస్‌తోనే అభివృద్ధి

సిద్దిపేట నియోజకవర్గం అభివృద్ధి పథంలో దూసుకుపోతోందని సుడా చైర్మన్ మారెడ్డి రవీందర్‌రెడ్డి అన్నారు. వివరాలు 11లో ▸

న్యూస్‌రీల్

మోసపోతే గోసపడతాం

బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శర్మ



మైలారంలో మున్నూరు కాపుల ఏకగ్రీవ తీర్మానం

చిన్నకోడూరు(సిద్దిపేట): కాంగ్రెస్, బీజేపీని నమ్మి గోసపడొద్దని బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాధాకృష్ణ శర్మ అన్నారు. బుధవారం మండల పరిధిలోని మైలారం, కమ్మర్లపల్లి గ్రామాల్లో మంత్రి హరీశ్‌రావుకు మద్దతుగా ప్రచారం నిర్వహించారు. మైలారంలో రజక, మున్నూరుకాపు, యాదవ, వడ్డెర సంఘాల సభ్యులు బీఆర్ఎస్‌కు మద్దతుగా ఏకగ్రీవ తీర్మానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం కేసీఆర్ సారథ్యంలో రాష్ట్రం దేశానికి మార్గదర్శకంగా మారిందన్నారు. రాష్ట్రంలో అమలవుతున్న పథకాలతో పేదలు సంతోషంగా ఉన్నారన్నారు. ఎంపీపీ మాణిక్యరెడ్డి, ఉపాధ్యక్షుడు పాపయ్య, ఏఎంసీ చైర్మన్ వనిత, పార్టీ మండల అధ్యక్షుడు శ్రీనివాస్, సర్పంచ్ కాల్వ ఎల్లయ్య, పీఏసీఎస్ చైర్మన్‌లు తదితరులు ఉన్నారు.

నేటి నుంచి సిటీ పోలీస్ యాక్టు

సిద్దిపేటకమాన్: పోలీసు కమిషనరేట్ పరిధిలో గురువారం నుంచి సిటీ పోలీస్‌యాక్టు అమల్లో ఉంటుందని సీపీ శ్వేత తెలిపారు. ఈ నెల 23వరకు ఈ నిబంధనలు అమల్లో ఉంటాయన్నారు. ఈ సమయంలో పోలీసుల అనుమతి లేకుండా ధర్నాలు, రాస్తారోకోలు, సభలు, సమావేశాలు నిర్వహించకూడదన్నారు. అదేవిధంగా సౌండ్ వినియోగంపై ఉన్న నిబంధనలు సైతం కొనసాగుతాయని పేర్కొన్నారు.

బీజేపీకి రాజీనామా



మాట్లాడుతున్న మందా నగేశ్ ముదిరాజ్

హుస్నాబాద్: ఎంపీ బండి సంజయ్ వ్యవహరిస్తున్న తీరును నిరసిస్తూ బీజేపీకి రాజీనామా చేస్తున్నట్లు ముదిరాజ్ మహాసభ మత్స్య విభాగం రాష్ట్ర అధ్యక్షుడు మందా నగేశ్ ముదిరాజ్ ప్రకటించారు. హుస్నాబాద్ పట్టణంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈటల రాజేందర్ బీజేపీలో చేరడం పార్టీకి అదృష్టమన్నారు. పార్టీని అధికారంలోకి తేవడానికి ఆయన ఎంతో కృషి చేస్తున్నారని తెలిపారు. కానీ ఈటల ఆశలను వమ్ము చేసేలా ఎంపీ బండి సంజయ్ వ్యవహరిస్తున్న తీరుతో పార్టీకి తీవ్ర నష్టం జరుగుతోందన్నారు. ఈ నియోజకవర్గం నుంచి పోటీ చేసేందుకు దరఖాస్తు చేసుకుంటే తనకు టికెట్ ఇవ్వలేదన్నారు. ప్రస్తుతం తాను ఏ పార్టీలో చేరడం లేదన్నారు. నియోజకవర్గంలోని ఏడు మండలాల్లోని తన అనుచరులతో సమావేశమై భవిష్యత్ కార్యాచరణను ప్రకటిస్తామన్నారు.

బైండోవర్ నోటీసులు సరికాదు

కాంగ్రెస్ ఓబీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు సూర్యవర్మ



సూర్యవర్మకు బైండోవర్ నోటీసులు అందిస్తున్న పోలీస్ సిబ్బంది

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): కాంగ్రెస్ నాయకులకు పోలీసులు బైండోవర్ నోటీసులు ఇవ్వడం సరికాదని ఓబీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు సూర్యవర్మ అన్నారు. బుధవారం సిద్దిపేట పట్టణంలోని పలువురు కాంగ్రెస్ నాయకులను పోలీసులు బైండోవర్ నోటీసులు అందించారు. ఈ సందర్భంగా సూర్యవర్మ మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం 'గ్యారంటీ' అని అన్నారు. ఉమ్మడి మెదక్ జిల్లాలో అన్ని నియోజకవర్గాలలో విజయం సాధించడం ఖాయమన్నారు.

పిచ్చి కుక్క దాడి

17 మందికి గాయాలు

నంగునూరు(సిద్దిపేట): పిచ్చికుక్క దాడిలో పలువురు గాయపడిన ఘటన బుధవారం నంగునూరులో జరిగింది. గ్రామంలోని బీసీ, ఎస్సీ కాలనీలో చిన్నారులు ఆడుకుంటున్నారు. పిచ్చి కుక్క వారిపై దాడి చేయడంతో ఎనిమిది మందికి గాయాలయ్యాయి. ఇది చూసిన కాలనీ వాసులు కుక్కను తరుముతుండగా అది వారిపై దాడి చేయడంతో మరో తొమ్మిది మంది గాయపడ్డారు. మొత్తం 17 మందిని చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

దుబ్బాకలో నలుగురికి గాయాలు

దుబ్బాక: పిచ్చి కుక్క దాడిలో నలుగురికి గాయాలయ్యాయి. మున్సిపల్ పరిధిలోని ధర్మాజీపేటలో ఇంటి బయట ఉన్న నలుగురిపై పిచ్చి కుక్క దాడి చేయడంతో గాయాలపాలయ్యారు. గాయపడిన వారిని మెరుగైన చికిత్స కోసం సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

సమరానికి రెఢీ!



ఎన్నికల సమరానికి అభ్యర్థులు 'రెఢీ' అయ్యారు. నామినేషన్ల ఉపసంహరణతో జిల్లాలోని నాలుగు నియోజకవర్గాల్లో 95 మంది బరిలో నిలిచారు. మొత్తం 224 మంది నామినేషన్లు దాఖలు చేయగా 200 మంది అభ్యర్థుల నామినేషన్లు ఆమోదం పొందాయి. ఉపసంహరణ తర్వాత 95 మంది రంగంలో ఉన్నారు. దుబ్బాక నియోజకవర్గంలో అత్యల్పంగా , అత్యధికంగా గజ్వేల్‌లో అభ్యర్థులు బరిలో ఉన్నారు. ప్రధాన పార్టీలు ఇండిపెండెంట్లను బుజ్జగించడమే కాక బరిలో నుంచి వైదొలిగేలా చర్యలు చేపట్టడం గమనార్హం.

నియోజకవర్గం	బరిలో అభ్యర్థులు
హుస్నాబాద్	19
సిద్దిపేట	21
దుబ్బాక	11
గజ్వేల్	44

బరిలో 95 మంది అభ్యర్థులు
- 105 మంది నామినేషన్ల ఉపసంహరణ
- గజ్వేల్‌లో అత్యధికం
- దుబ్బాకలో అత్యల్పం
- ఇండిపెండెంట్లకు గుర్తుల కేటాయింపు

సాక్షి, సిద్దిపేట: అసెంబ్లీ ఎన్నికల బరిలో ఎవరెవరు ఉంటారో తేలిపోయింది. ఈ నెల 3 నుంచి 10వ తేదీ వరకు నామినేషన్ల స్వీకరణ, 13న పరిశీలన జరిగింది. నెల 14, 15వ తేదీలో నామినేషన్ల ఉపసంహరణ గడువు ముగిసింది. ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం 200 మంది నామినేషన్లు దాఖలు చేశారు. ఈ నెల 14, 15 తేదీల్లో నామినేషన్లను ఉప సంహరణకు గడువు ఇచ్చారు. దీంతో నాలుగు నియోజకవర్గాల్లో 105 మంది అభ్యర్థుల తమ నామినేషన్లను ఉపసంహరించుకున్నారు. సిద్దిపేట నియోజకవర్గంలో ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఆర్‌డీఓ రమేశ్ బాబు, దుబ్బాక ఆర్‌ఓ అదనపు కలెక్టర్ గరీమా అగర్వాల్, హుస్నాబాద్ ఆర్‌డీఓ బెన్‌షాలం, గజ్వేల్ ఆర్‌డీఓ బన్సీలాల్‌కు పలువురు ఉపసంహరణ పత్రాలను అందించారు, దీంతో 95 మంది బరిలో ఉన్నట్లు లెక్క తేలింది.

గజ్వేల్‌లో..

గజ్వేల్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ అధినేత, సీఎం కేసీఆర్, బీజేపీ నుంచి ఈటల రాజేందర్ మధ్య హోరాహోరి పోరు నెలకొంది. బీఆర్ఎస్, బీజేపీలు ప్రచారంలో దూసుకెళ్తున్నాయి. దీనికి తోడు జిల్లాలోనే అత్యధికంగా అభ్యర్థులు గజ్వేల్‌లో బరిలో నిలిచారు. 44 మంది అభ్యర్థులు పోటీ ఉన్నారు. దుబ్బాక నియోజకవర్గంలో ఎమ్మెల్యే, బీజేపీ అభ్యర్థి రఘునందన్ రావు ప్రచారం జోరుగా చేస్తున్నారు. ఎంపీ, బీఆర్ఎస్ అభ్యర్థి కొత్త ప్రభాకర్ పై కత్తితో దాడి జరగడంతో ఆయన కుటుంబ సభ్యులు ప్రచారం నిర్వహిస్తున్నారు.

గుర్తుల కేటాయింపు

నాలుగు నియోజకవర్గాల్లో ఇండిపెండెంట్ అభ్యర్థులకు గుర్తులను ఆర్‌ఓలు కేటాయించారు. ఇండిపెండెంట్ అభ్యర్థులు ప్రచారం నిర్వహించేందుకు సన్నద్ధమవుతున్నారు.

మిగిలింది 12 రోజులే..

ప్రచార యుద్ధం ఆరంభమైంది. ప్రధాన పార్టీల అభ్యర్థులు ప్రచార జోరు పెంచారు. గెలుపే ధ్యేయంగా పార్టీలు వ్యూహాలు రచిస్తున్నాయి. ఎన్నికల ప్రచారానికి 12 రోజులే మిగిలి ఉంది. పలు నియోజకవర్గాల్లో బీఆర్ఎస్ అభ్యర్థులు ఇప్పటికే ఒక దఫా ప్రచారం పూర్తి చేశారు. బీఆర్ఎస్ అందరి కంటే ముందు అభ్యర్థుల ప్రకటనతో ప్రచారంలో ముందుంది.

దుబ్బాకలో 11 మంది



అభ్యర్థులకు గుర్తులు కేటాయిస్తున్న ఆర్ఓ గరిమా అగర్వాల్

దుబ్బాకటౌన్: అసెంబ్లీ బరిలో 11 మంది అభ్యర్థులు పోటీలో నిలిచారు. మొత్తం 22 మంది నామినేషన్లు వేయగా స్క్రూటినీలో ఏడు తిరస్కరణకు గురయ్యాయి. బుధవారం చివరిరోజున నలుగురు అభ్యర్థులు వైదొలిగారు. దీంతో పోటీలో 11 మంది మిగిలారు. పోటీలో ఉన్న స్వతంత్రులకు గుర్తులు కేటాయించినట్లు ఆర్ఓ గరిమా అగర్వాల్ తెలిపారు.



సాక్షి దినపత్రిక చదువుతున్న విద్యార్థినులు

'సాక్షి' పఠనం.. సమస్తం అవగతం

చిన్నారులందరూ 'సాక్షి' దినపత్రిక చదువుతున్నారు.. ఏమిటీ విశేషం అనుకుంటున్నారా?.. బోలెడు విశేషాలున్నాయండీ బాబు.. సిద్దిపేట జిల్లా కేంద్రంలోని పలు పాఠశాలల్లో రోజూ ఉదయం వేళ ప్రేయర్ చేసిన వెంటనే రోజువారీ ముఖ్య సమాచారం వినిపిస్తారు. అందులో భాగంగా సాక్షిలో ప్రచురించిన ప్రధాన వార్తలను చదివే పనిలో నిమగ్నమయ్యారు వీరు. సాక్షి పత్రిక పఠనంతో సమస్త అంశాలను తెలుసుకున్నట్టుగా ఉందని విద్యార్థులు చెబుతున్నారు. -సిద్దిపేటజోన్

పకడ్బందీగా ఎన్నికల ఏర్పాట్లు



కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్, సీపీ శ్వేతలతో సమావేశమైన అబ్జర్వర్లు

కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్

సిద్దిపేటరూరల్: ఎన్నికల ఏర్పాట్లు, నిబంధనలు పకడ్బందీగా అమలయ్యేలా చర్యలు చేపడుతున్నట్లు కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్ తెలిపారు. జనగాం జిల్లాకు చెందిన ఎన్నికల అబ్జర్వర్లు కలెక్టర్ ప్రశాంత్ జీవన్‌తో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా జనగాం జిల్లాకు చెందిన జనరల్ అబ్జర్వర్ కె.రాజమణి(ఐఏఎస్), పోలీస్ అబ్జర్వర్ సుజిత్‌కుమార్ (ఐపీఎస్)లు సమావేశానికి హాజరయ్యారు. చేర్యాల, మద్దూరు, ధూళ్మిట్ట, కొమురవెల్లి మండలాల్లో చేపట్టిన ఎన్నికల ఏర్పాట్లను వారు కలెక్టర్‌తో చర్చించారు. కార్యక్రమంలో జిల్లా పోలీస్ అబ్జర్వర్ సోనమ్ టెన్సింగ్ భూటియా, పోలీస్ కమిషనర్ శ్వేత పాల్గొన్నారు.

29, 30 తేదీలలో సెలవు

సిద్దిపేటరూరల్: అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ఈనెల 29, 30వ తేదీలలో పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసిన ప్రభుత్వ విద్యా సంస్థలకు, కార్యాలయాలకు, పరిశ్రమలకు వేతనంతో కూడిన సెలవులు ఇవ్వనున్నట్లు కలెక్టర్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అదేవిధంగా ఇందూరు ఇంజనీరింగ్ కాలేజీకి ఓట్ల లెక్కింపు సందర్భంగా డిసెంబర్ 2, 3న వేతనంతో కూడిన సెలవును ప్రకటిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈఓ శ్రీనివాస్‌రెడ్డి

టెన్త్ విద్యార్థులకు ప్రత్యేక తరగతులు

- ఉత్తీర్ణత శాతం పెంచేందుకు చర్యలు
- డీఈఓ శ్రీనివాస్‌రెడ్డి

మిరుదొడ్డి(దుబ్బాక): టెన్త్ వార్షిక పరీక్షల్లో అత్యుత్తమ ఫలితాలను సాధించేందుకు చర్యలు తీసుకుంటున్నామని, అందులో భాగంగా విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నట్లు డీఈఓ ఎల్లంకి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. మండల పరిధిలోని కొండాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలను బుధవారం ఆయన సందర్శించారు. టెన్త్ విద్యార్థులకు నిర్వహిస్తున్న బోధనా పద్ధతులను అడిగి తెలుసుకున్నారు. మధ్యాహ్న భోజన నిర్వహణ, రికార్డులను, పాఠశాల పరిసరాలను ఆయన పరిశీలించారు. పాఠశాలలో కల్పిస్తున్న మౌలిక వసతులపై ఆరా తీశారు. ఆయన మాట్లాడుతూ వార్షిక పరీక్షలకు విద్యార్థులను సన్నద్ధం చేయడానికి ఉపాధ్యాయులు ఇప్పటి నుంచే ప్రణాళికలు సిద్ధం చేయాలని కోరారు. ఉదయం గంట పాటు రోజుకో సబ్జెక్ట్ చొప్పున తరగతులు నిర్వహించాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. విద్యార్థుల విద్యాభివృద్ధికి తల్లిదండ్రులు ప్రతి సోమవారం ప్రత్యేక సమావేశం నిర్వహించి విద్యా ప్రగతికి సహకరించాలని సూచించారు. టెన్త్ పరీక్షా ఫలితాల్లో జిల్లాను అగ్రగామిగా నిలిపేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఎంఈఓ జోగు ప్రభుదాసు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రగతికే పట్టం కట్టండి



ప్రజా ఆశీర్వాద సభలో అభివాదం చేస్తున్న సీఎం కేసీఆర్, పద్మాదేవేందర్‌రెడ్డి

ప్రజా ఆశీర్వాద సభలో సీఎం కేసీఆర్
- బీఆర్ఎస్‌తోనే తాగు, సాగునీరు, నిరంతర విద్యుత్
- మెదక్‌లో రింగ్‌రోడ్డు, ఇంజనీరింగ్ కాలేజీ ఏర్పాటు
- కాంగ్రెస్ పాలనలో అంతా అధోగతే
- పద్మను గెలిపిస్తే మరింత అభివృద్ధి

మెదక్/హవేళిఘణాపూర్: మెదక్‌లో బీఆర్ఎస్ అభ్యర్థి పద్మాదేవేందర్‌రెడ్డిని గెలిపిస్తే ఈ ప్రాంతం అన్నిరంగాల్లో అభివృద్ధి చెందుతుందని, మెదక్‌కు రింగురోడ్డు, ఇంజనీరింగ్ కాలేజీలు వస్తాయని ప్రజా ఆశీర్వాద ఎన్నికల సభలో సీఎం కేసీఆర్ చెప్పారు. బుధవారం మెదక్ సీఎస్ఐ చర్చి గ్రౌండ్‌లో నిర్వహించిన సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఎన్నికలు రాగానే ఆగమాగం కావొద్దని, ఎవరెవరో వచ్చి ఓట్లు అడుగుతారని, వాళ్లను నమ్మి ఓట్లు వేస్తే ఈ ప్రాంతం వెనుకబడిపోతుందన్నారు. పద్మాదేవేందర్‌రెడ్డి చొరవతోనే ఇటీవల రామాయంపేట డివిజన్ ఏర్పాటు, డిగ్రీ కళాశాలను మంత్రి హరీశ్‌రావు ప్రారంభించారని గుర్తు చేశారు. 70 సంవత్సరాల నుంచి కాంగ్రెస్ చేసిందేమీ లేదని, ఎలాంటి వారు గెలిస్తే మన తలరాతమారుతుందో ఆలోచించాలని ప్రజలకు సూచించారు. కాంగ్రెస్ 50 ఏళ్ల పాలనలో అభివృద్ధి, సంక్షేమం శూన్యమని ఆరోపించారు. బీఆర్ఎస్‌తోనే సాగు, తాగునీరు, 24 గంటల కరెంటు సాధ్యమన్నారు. అలాగే చేనేత కార్మికులు, రైతుల ఆత్మహత్యలను నివారించామని చెప్పారు. పేదల సంక్షేమం, అభివృద్ధికి పెద్దపీట వేశామన్నారు. మెదక్‌లో నీటి పన్నును రద్దు చేసింది బీఆర్ఎస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాతనేనని గుర్తు చేశారు. రైతుబంధు, బీమాను కాంగ్రెస్ వారు దుబారా అంటూ పేర్కొనడం హాస్యాస్పదంగా ఉందని, రైతుబంధు ఉండాలా? వద్దా ? అంటూ ప్రజలను ప్రశ్నించారు. ఉండాలంటూ వారంతా కేరింతలు కొట్టడంతో ఆయన సంతోషం వ్యక్తం చేశారు.

పద్మతో కాంగ్రెస్ అభ్యర్థి పోలికనా..

బీఆర్ఎస్ అభ్యర్థి పద్మదేవేందర్‌రెడ్డితో కాంగ్రెస్ అభ్యర్థి రోహిత్‌కు పోలికనా అంటూ సీఎం కేసీఆర్ ఎద్దేవా చేశారు. ఆయన ఒక దిష్టిబొమ్మలా ఉంటారన్నారు. ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటు కావడంతోనే మెదక్ జిల్లా కేంద్రం ఏర్పాటైందన్నారు. మెదక్‌కు రైలుకూత, ఘణపురం ఆనకట్ట పెంపు, సింగూరు జలాలు సకాలంలో విడుదల, మంజీరా, హల్దీ ప్రాజెక్టులపై చెక్ డ్యామ్‌ల నిర్మాణాలు జరిగాయన్నారు.

అభివృద్ధి ప్రదాతకే మా మద్దతు

- హరీశ్‌రావుకే మా ఓటు అంటూ గుర్రాలగొంది వాసుల తీర్మానం
- ప్రచారంలో పాల్గొన్న బీఆర్ఎస్ నాయకులు



మద్దతు పత్రాన్ని అందిస్తున్న గ్రామస్తులు

సిద్దిపేటరూరల్: తమ గ్రామాన్ని అభివృద్ధి చేయడమేకాక, రాష్ట్ర, జాతీయ స్థాయిలో అవార్డులు వచ్చేలా కృషి చేసిన మంత్రి హరీశ్ రావుకే మా మద్దతు అని గుర్రాలగొంది గ్రామం వాసులు ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. ఈమేరకు బుధవారం తీర్మాన పత్రాన్ని గ్రామంలో ప్రచారం చేపట్టిన బీఆర్ఎస్ నాయకులకు అందించారు. నారాయణరావుపేట మండలం గుర్రాలగొంది గ్రామంలో బీఆర్ఎస్ అభ్యర్థి హరీశ్‌రావకు మద్దతుగా పార్టీ నాయకులు ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ తిరుగుతూ గ్రామాభివృద్ధికి కృషి చేసిన హరీశ్‌రావుకు ఓటు వేయాలని అభ్యర్థించారు. లక్షన్నరకు పైగా మెజార్టీ అందించి గెలిపించాలన్నారు. అనంతరం గ్రామంలోని కులసంఘాలు మద్దతు పత్రాలను అందించారు. కార్యక్రమంలో ఎంపీపీ బాలకృష్ణ, వైస్ ఎంపీపీ సంతోష్, సర్పంచ్ ఆంజనేయులు, ఎంపీటీసీ హరీశ్, వ్యాపారవేత్త రవీందర్‌రావు, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

హరీశ్ చొరవతో మారిన రూపురేఖలు

సిద్దిపేటజోన్: మంత్రి హరీశ్‌రావు ప్రత్యేక చొరవతో సిద్దిపేట రూపురేఖలు మారిపోయాయని మున్సిపల్ మాజీ చైర్మన్ రాజనర్స్ అన్నారు. బుధవారం బీఆర్ఎస్ అభ్యర్థి హరీశ్ రావుకు మద్దతుగా పట్టణంలోని 37, 40, 43 వార్డుల్లో ప్రచారం నిర్వహించారు. అన్ని రంగాల్లో సిద్దిపేటను ముందు వరుసలో ఉంచిన హరీశ్ రావుకు అండగా ఉండాలని కోరారు. ఆయన వెంట మున్సిపల్ వైస్ చైర్మన్ కనకరాజు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

రియల్ ఎస్టేట్ అసోసియేషన్ సభ్యులు..



తీర్మాన పత్రాలను అందిస్తున్న అసోసియేషన్ ప్రతినిధులు

సిద్దిపేటజోన్: మంత్రి హరీశ్‌రావుకు మద్దతు ఇస్తూ రియల్ ఎస్టేట్ అసోసియేషన్ సభ్యులు ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. ఈ మేరకు బుధవారం సాయి రియల్ ఎస్టేట్ అసోసియేషన్ పరిధిలోని 121 సభ్యులు, వారి కుటుంబాలకు చెందిన వారంతా సమావేశం నిర్వహించారు. అనంతరం మున్సిపల్ మాజీ చైర్మన్ రాజనర్స్, పార్టీ పట్టణ అధ్యక్షుడు సంపత్ రెడ్డిలకు తీర్మాన పత్రాన్ని అందచేశారు.

25 నుంచి ప్రతిష్ఠ మహోత్సవాలు

కొండపాక(గజ్వేల్): దేశంలోనే మొట్టమొదటి అష్టాదశ శక్తిపీఠ సహిత ఉమా రామలింగేశ్వర స్వామి దేవాలయ నిర్మాణం పూర్తయిందని విశ్రాంత ఐఏఎస్, ప్రభుత్వ సలహాదారు కేవీ రమణాచారి తెలిపారు. మండల కేంద్రంలోని ఆనంద నిలయంలో ట్రస్టు సభ్యులతో కలిసి బుధవారం మాట్లాడారు. ఆగమశాస్త్ర విధానంలో చక్కని శిల్ప సంపదతో సుమారు రూ.6 కోట్లతో దేవాలయం నిర్మించామన్నారు. ఈ నెల 25, 26, 27 తేదీల్లో ప్రతిష్ఠ మహోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆనంద నిలయం ఆవరణలో వృద్ధాశ్రమం, సత్యసాయి వైద్యాలయం, అనాథ పిల్లల బాలసదనం, సత్యసాయి బాలికల విద్యాలయాలు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు.



మాట్లాడుతున్న కేవీ రమణాచారి


మాట్లాడుతున్న సీఎం కేసీఆర్, పక్కన అభ్యర్థి పద్మ


సీఎం కేసీఆర్‌తో మాట్లాడుతున్న హరీశ్‌రావు


కేసీఆర్, హరీశ్‌రావు, పద్మ కటౌట్లతో కార్యకర్త


యువకుల ఉత్సాహం


ప్రజా ఆశీర్వాద సభకు వస్తున్న సీఎం కేసీఆర్


ఫోన్‌లో ఫొటో తీస్తున్న వృద్ధుడు


సభకు హాజరైన మహిళా కార్యకర్తలు


కేసీఆర్‌కు జ్ఞాపికను అందజేస్తున్న దృశ్యం

కేసీఆర్ సభ ఇలా..

మెదక్ కలెక్టరేట్: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో బుధవారం మెదక్‌లో బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రజా ఆశీర్వాద సభకు సీఎం కేసీఆర్ హాజరై ప్రసంగించారు. ఇందుకు సంబంధించిన సైడ్ లైట్స్..

- సాయంత్రం 4.41 గంటలకు సీఎం కేసీఆర్ హెలీప్యాడ్ ల్యాండ్ అయ్యింది.
- 4.50 గంటలకు సీఎం క్యారీవ్యాన్ ద్వారా సభ స్టేజీపైకి చేరుకున్నారు.
- 4.56 గంటలకు ప్రసంగం ప్రారంభించి 5.13 గంటల వరకు మాట్లాడారు.
- సాయంత్రం 5.35 గంటలకు హెలీప్యాడ్ ద్వారా మెదక్ నుంచి కేసీఆర్ బయల్దేరి వెళ్లిపోయారు.
- సీఎం మాట్లాడుతున్న సమయంలో ప్రజలు ఆసక్తిగా తిలకించారు.
- మైక్ స్టాండ్‌లు, లైట్ స్టాండ్‌లు, రోడ్ డివైడర్, భవనాలపై నిలబడి ప్రజలు ఆసక్తిగా విన్నారు.
- ధ్యాన్‌చంద్ చౌరస్తా వద్ద వాహనాల రాకపోకలను నిలిపివేశారు.
- మిలట్రీ పోలీస్, పోలీసు అధికారులు, కానిస్టేబుళ్లతో పెద్ద ఎత్తున బందోబస్తు ఏర్పాటు చేశారు.
- సభకు తరలివచ్చిన వాహనాలకు సీఎస్ఐ చర్చి ముందు, వెనుక ప్రాంతాల్లో పార్కింగ్ ఏర్పాటు చేశారు.

క్లుప్తంగా

బంగారు తెలంగాణకు కేసీఆర్ కృషి

కొండపాక(గజ్వేల్): బంగారు తెలంగాణ సాధన కోసం సీఎం కేసీఆర్ కృషి చేస్తున్నారని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ లక్కిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఎన్‌ఆర్‌ఈజీఎస్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యురాలు కోల సద్గుణ అన్నారు. కుకునూరుపల్లి మండల కేంద్రంలో బుధవారం గ్రామాధ్యక్షులు మల్లం ఐలయ్యతో కలిసి ఇంటింటా తిరుగుతూ ప్రభుత్వ పథకాల అమలుపై ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మరోసారి సీఎం కేసీఆర్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను కోరారు. కార్యక్రమంలో నాయకులు పిస్క అమర్, భూములుగౌడ్, అజీమొద్దీన్, సంతోష్, కొంతం రాజు, తూం మహేందర్, సంపత్, నర్సింలుగౌడ్, నాగరాజు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాభిప్రాయం మేరకు పని

డీసీసీబీ చైర్మన్ చిట్టి దేవేందర్‌రెడ్డి

కొండపాక(గజ్వేల్): ప్రజాభిప్రాయం మేరకు పని చేయడం సీఎం కేసీఆర్‌కే సాధ్యమని డీసీసీబీ చైర్మన్ చిట్టి దేవేందర్‌రెడ్డి, జాగృతి రాష్ట్ర కార్యదర్శి అనంతుల ప్రశాంత్ పేర్కొన్నారు. మండల పరిధిలోని బందారం గ్రామంలో బుధవారం ఎంపీపీ ర్యాగల్ల సుగుణతో కలిసి ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బందారం, అంకిరెడ్డిపల్లి, దర్గా గ్రామాల్లోని చెరువులకు కాల్వ ద్వారా గోదావరి నదీ జలాలు తీసుకొచ్చే బాధ్యతను సీఎం కేసీఆర్ తీసుకున్నారన్నారు. కార్యక్రమంలో నాయకులు నూనె కుమార్, ర్యాగల్ల దుర్గయ్య, కొలుపుల గంగాధర్, అనంతుల నరేందర్, మంచాల శ్రీనివాస్, నర్ర జైపాల్‌రెడ్డి, నీల వెంకటేశం, గంగుల బాలరాజు, గొట్టి ఐలయ్య, తదితరులు పాల్గొన్నారు.

అసత్య ప్రచారాలు నమ్మొద్దు


పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న సోనమ్ టెన్నింగ్ భూటియా

దౌల్తాబాద్(దుబ్బాక): ప్రశాంత వాతావరణంలో జరిగే ఎన్నికలకు ఎవరైనా భంగం కలిగిస్తే చట్ట పరమైనా చర్యలు తప్పవని, సామాజిక మాధ్యమాల్లో ప్రచారమయ్యే అసత్య ప్రచారాలు నమ్మొద్దని జిల్లా ఎన్నికల పోలీస్ అబ్జర్వర్ సోనమ్ టెన్నింగ్ భూటియా హెచ్చరించారు. బుధవారం మండల పరిధిలోని సూరంపల్లిలో సమస్యాత్మక ఎన్నికల పోలింగ్ కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. చెక్‌పోస్టుల్లో విధులు నిర్వహించే సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, వచ్చిపోయే ప్రతీ వాహనాన్ని తప్పకుండా తనిఖీలు చేపట్టాలన్నారు. రాత్రి సమయాల్లో తనిఖీలు చేసేటప్పుడు టార్చ్‌లైట్‌ను తప్పకుండా వినియోగించాలన్నారు. కార్యక్రమంలో ఏసీపీ రమేశ్, సీఐ కమాలాకర్, ఎస్సై చైతన్యకుమార్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

దుబ్బాక గడ్డ.. సంచలనాలకు అడ్డా

జంగ్ తెలంగాణ



- సీఎం కేసీఆర్ పుట్టిపెరిగింది ఇక్కడే
- నక్సలైట్, జర్నలిస్టు నుంచి 4 సార్లు ఎమ్మెల్యేగా రామలింగారెడ్డి
- 2020 ఉపఎన్నికల్లో రఘునందన్‌రావు గెలుపు
- ఈ గెలుపుతోనే రాష్ట్రంలో బీజేపీకి ఊపు
- తాజాగా కొత్త ప్రభాకర్‌రెడ్డిపై కత్తితో దాడి

దుబ్బాకటౌన్: రాష్ట్ర వ్యాప్తంగా సంచలనాలకు కేంద్రబిందువుగా నిలిచింది దుబ్బాక. విప్లవోద్యమాలకు .. తెలంగాణ ఉద్యమానికి కీలకభూమిక పోషించింది.. ఒకే నియోజకవర్గం నుంచి 4 నక్సలైట్ దళాలు (దుబ్బాక, ఇందుప్రియాల్, గిరాయిపల్లి పీపుల్స్‌వార్ దళాలు, జనశక్తి కూడవెల్లి దళం) కార్యకలాపాలు సాగించి దేశంలోనే ప్రత్యేక గుర్తింపు పొందింది. అలాగే, సీఎం కేసీఆర్‌కు విద్యాబుద్ధులు నేర్పిన గడ్డ, తెలంగాణ ఉద్యమంలోనూ వందలాది కేసులతో జైలు జీవితాలు అనుభవించిన వారితోపాటు పదుల సంఖ్యలో అమరులైన పోరాటాల గడ్డగా దుబ్బాకను చెప్పవచ్చు. నియోజకవర్గంలోని తొగుట మండలంలో నిర్మించిన కొమరవెల్లి మల్లన్నసాగర్ రిజర్వాయర్‌తో పదికిపైగా నివాస గ్రామాల ప్రజలు తరతరాల నుంచి ఉన్న ఊళ్లు, పుట్టిపెరిగిన ఇళ్లు, భూములను వదిలి చెట్టుకొకరు పుట్టకొకరు అయ్యారు.

సీఎం కేసీఆర్ విద్యాబుద్ధులు ఇక్కడే..

సీఎం కేసీఆర్ ఓనమాలు నేర్చింది దుబ్బాకలోనే. దుబ్బాకకు కేవలం 6 కిలోమీటర్ల దూర ంలో ఉన్న (ప్రస్తుతం సిద్దిపేట నియోజకవర్గంలో ఉన్న చింతమడక) నుంచి తన సోదరితో కాలినడకన నడుచుకుంటూ వచ్చి చదువుకున్నారు. దుబ్బాకలోనే 3 నుంచి 10 వ తరగతి చదువుకున్నారు. దుబ్బాకలో కేసీఆర్‌కు చదువుచెప్పిన గురువులతోపాటు తనతోపాటు చదువుకున్న మిత్రులను ఇప్పటికీ పేరుపెట్టి పిలుస్తుంటారు. తాను చదువుకున్న పాఠశాల శిథిలావస్థలో ఉండడంతో రూ.12 కోట్లు ప్రత్యేక నిధులు మంజూరి చేయించి అధునాతన హంగులతో కొత్త భవనం నిర్మించారు.

ఉపఎన్నికల్లో రఘునందన్‌రావు గెలుపు..

అనారోగ్యంతో ఎమ్మెల్యే రామలింగారెడ్డి మరణంతో 2020లో దుబ్బాకలో ఉపఎన్నికలు జరిగాయి. ఇందులో బీజేపీ నుంచి మాధవనేని రఘునందన్‌రావు గెలిచి రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించాడు. ఈ గెలుపుతో రాష్ట్రంలో బీజేపీకి మంచి ఊపు వచ్చింది. దుబ్బాక ఫలితంలో రాజకీయంగా తెలంగాణలో అనేక పరిణామాలు చోటు చేసుకున్నాయి.

నక్సలైట్, జర్నలిస్టు నుంచి..

నక్సలైట్‌గా.. జర్నలిస్టు స్థాయి నుంచి నాలుగు సార్లు ఎమ్మెల్యేగా పని చేశారు దివంగత నేత సోలిపేట రామలింగారెడ్డి. చిట్టాపూర్‌కు చెందిన రామలింగారెడ్డి దుబ్బాకలో ఇంటర్ చదువుకుంటున్న కాలంలోనే విప్లవోద్యమాల బాట పట్టి రాడికల్ స్టూడెంట్ యూనియన్ జిల్లా అధ్యక్షుడితోపాటు పలు స్థాయిల్లో పనిచేయడంతోపాటు పీపుల్స్‌వార్ కేంద్ర, రాష్ట్ర కమిటీలోని చాలామంది నేతలతో సంబంధాలు నడిపాడు. జర్నలిస్టుగా 20 ఏళ్ల పని చేశారు.

ఎంపీ ప్రభాకర్‌రెడ్డిపై దాడి..

ఎన్నికల ప్రచారంలో తాజాగా దుబ్బాక బీఆర్‌ఎస్ అభ్యర్థి కొత్త ప్రభాకర్‌రెడ్డిపై కత్తితో దాడి జరిగింది. ఇంకా ఆస్పత్రిలోనే చికిత్స పొందుతున్నాడు. ఎంపీపై దాడి రాష్ట్ర రాజకీయాల్లోనే ఓ దుమారం లేపింది. ప్రతిపక్ష పార్టీలు ఎంపీపై పథకం ప్రకారమే దాడి చేయించారంటూ సీఎం కేసీఆర్, మంత్రులు హరీశ్‌రావు, కేటీఆర్ ప్రత్యక్షంగా ఆరోపణలు చేస్తున్న విషయం విదితమే. ఈ ఘటన ప్రస్తుత ఎన్నికల సమయంలో జరగడంతో తీవ్ర సంచలనంగా మారింది. ఇవే కాదు రాష్ట్రవ్యాప్తంగా అనేక ఘటనలకు దుబ్బాక నియోజకవర్గం కేంద్రబిందువుగా మారింది.

పీటీజెడ్ కెమెరాలతో నిఘా

- వాహనాలపై ప్రత్యేకంగా ఏర్పాటు
- అభ్యర్థుల ప్రచార తీరు రికార్డు

నారాయణఖేడ్: అభ్యర్థుల ఎన్నికల ప్రచారంపై అధికార యంత్రాంగం నిఘా పెరుగుతోంది. ప్రచార తీరు, ప్రవర్తన నియమావళి అమలు, జన సమీకరణ, వాహన శ్రేణి, గొడవలు తదితర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించేందుకు ఫ్లయింగ్ స్క్వాడ్ ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. తమ వాహనాలకు అధునాతన పీటీజెడ్ సీసీ కెమెరాలు ఏర్పాటు చేసింది. ఇవి 360 డిగ్రీల కోణంలో తిరుగుతూ సుమారు 50 మీటర్ల దూరం వరకు నాణ్యతతో వీడియో రికార్డింగ్ చేస్తుంది. నారాయణఖేడ్ నియోజకవర్గంలో నిజాంపేట్, కల్హేర్, పెద్దశంకరంపేట మండలాలు కలుపుతూ ఒక రూట్‌గా విభజించి ఒక వాహనం, కంగ్టి, సిర్గాపూర్ రూట్‌కు మరో వాహనం, మనూరు, నాగల్‌గిద్ద, నారాయణఖేడ్ మండలాలతో మూడో రూట్‌గా నిర్ణయించి ఒక వాహనం చొప్పున కేటాయించారు. ఇవన్నీ పీటీజెడ్ సీసీ కెమెరా జీపీఎస్ ద్వారా కలెక్టరేట్, రాష్ట్ర ఎన్నికల అధికారి కార్యాలయానికి అనుసంధానమై ఉంటాయి. ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు ఈ వాహనాల ద్వారా పర్యవేక్షణ చేస్తుంటారు.


బ్యాటరీ, జీపీఎస్ సదుపాయం


వాహనంపై ఏర్పాటు చేసిన పీటీజెడ్ కెమెరా

లిక్కర్ తెలంగాణగా మార్చిండు

- సీఎం కేసీఆర్ మళ్లీ వస్తే ఏం మిగల్చరు
- దుబ్బాకలో బీజేపీ గెలుపు ఖాయమైపోయింది
- ఎంపీగా ఉండి ప్రభాకర్‌రెడ్డి దుబ్బాకకు ఏం చేసిండో ఆలోచించండి
- పరాయి పెత్తనం మరోసారి తరిమిగొడుదాం
- బీజేపీ అభ్యర్థి రఘునందన్‌రావు

దుబ్బాకటౌన్: బంగారు తెలంగాణ పేరుతో లిక్కర్ తెలంగాణగా మార్చిన కేసీఆర్ ప్రభుత్వానికి ప్రజలు ఈ ఎన్నికల్లో కర్రుకాల్చి వాతపెట్టాలని దుబ్బాక బీజేపీ అభ్యర్థి, ఎమ్మెల్యే మాధవనేని రఘునందన్‌రావు అన్నారు. బుధవారం దుబ్బాక మండలం రామక్కపేట, పెద్ద చీకోడ్, నర్లెంగడ్డ, పద్మశాలీగడ్డ గ్రామాలతోపాటు దుబ్బాక మున్సిపాలిటీ పరిధిలోని మల్లాయపల్లి, చేర్వాపూర్, ధర్మాజీపేట వార్డుల్లో ఎమ్మెల్యే రఘునందన్‌రావు ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సభల్లో రఘునందన్‌రావు మాట్లాడుతూ.. కేసీఆర్ కుటుంబపాలనకు తెలంగాణ ప్రజలు ఈ ఎన్నికల్లో చరమగీతం పాడటం ఖాయమైందన్నారు. బీఆర్‌ఎస్ అవినీతి కుటుంబ పాలనకు చెక్ పెట్టకుంటే రాష్ట్రాన్ని మొత్తం ఏం మిగుల్చకుండా దోచుకతింటారని ఆరోపించారు.

బీజేపీ గెలుపు ఖాయం

పోరటాల గడ్డ దుబ్బాక నియోజకవర్గంలో తన గెలుపు ఎప్పుడో ఖాయమైపోయిందని రఘునందన్‌రావు అన్నారు. 2020 ఉప ఎన్నికల్లో కేసీఆర్‌తో సహా మొత్తం క్యాబినేట్, ఎమ్మెల్యేలు, పోలీసు అధికారులందరూ కలిసి నన్ను ఓడగొట్టేందుకు సర్వశక్తులు ఒడ్డారని, కానీ దుబ్బాక ప్రజలు నన్ను గెలిపించి తమ పౌరుషాన్ని చూపారన్నారు. మూడేళ్ల తనకు అధికాం ఇస్తే దుబ్బాక నియోజకవర్గం అభివృద్ధిపై అసెంబ్లీలో ప్రభుత్వాన్ని నిలదీసి నిధులు తెచ్చి అభివృద్ధి చేశానన్నారు. రాష్ట్ర ఖజానా అంతా సిద్దిపేట, గజ్వేల్, సిరిసిల్లకే ఖర్చుపెట్టి మిగతా నియోజకవర్గాలకు చాలా అన్యాయం చేశారన్నారు.

హరీశ్‌రావును ప్రజలు నమ్మరు..

హరీశ్‌రావును దుబ్బాక ప్రజలు నమ్మరని .. ట్రబుల్ షూటర్ అని గొప్పలు చెప్పుకునే హరీశ్‌కు ఉప ఎన్నికల్లో ప్రజలు కర్రుకాల్చి వాతపెట్టారని.. మళ్లీ ఆయనకు ఓటమి రుచి చూపుతామని ఎమ్మెల్యే రఘునందన్‌రావు అన్నారు. ఉన్న నిధులన్నీ సిద్దిపేటకే తీసుకుపోయి దుబ్బాక నియోజకవర్గానికి తీరని అన్యాయం చేశారన్నారు.

ప్రభాకర్‌రెడ్డి దుబ్బాకకు ఏం చేసిండు..

రెండు పర్యాయాలు ఎంపీగా ఉన్న ప్రభాకర్‌రెడ్డి దుబ్బాక నియోజకవర్గంలో ఏం అభివృద్ధి చేసిండో ప్రజలు గమనించాలని రఘునందన్‌రావు అన్నారు. కేంద్ర ప్రభుత్వం నిధులతో అభివృద్ధి జరిగితే తామే చేశామంటూ చెప్పుకోవడం సిగ్గుచేటన్నారు. తాను ప్రశ్నించే గొంతుకనని ఎవరి దగ్గర చేతులు కట్టుకొని నిలబడను అని.. ప్రజల కోసం ఎంతటి త్యాగానికైనా వెనుకాడనని ఇది ఆలోచించి కమలం పువ్వు గుర్తుకు ఓట్లేసి భారీ మెజార్టీతో నన్ను గెలిపించి మరోసారి అసెంబ్లీకి పంపాలన్నారు.


చేగుంటలో రఘునందన్‌రావు కోసం ఇంటింటి ప్రచారం చేస్తున్న బీజేపీ నాయకులు


పెద్దచీకోడ్‌లో మాట్లాడుతున్న రఘునందన్‌రావు

భారీగా చేరికలు..

నియోజకవర్గంలోని పలు గ్రామాలకు చెందిన బీఆర్‌ఎస్, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, కుల సంఘాల నాయకులు రఘునందన్‌రావు సమక్షంలో బీజేపీలో చేరారు. వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. రఘునందర్‌రావుకు మహిళలు మంగళహారతులు, బోనాలు బతుకమ్మలతో స్వాగతం పలికారు.

చేగుంటలో ఇంటింటి ప్రచారం

చేగుంట(తూప్రాన్): మండల కేంద్రమైన చేగుంటలో బీజేపీ నాయకులు మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ గడ్డమీద సుజాత, ఎస్సీ సెల్ నాయకులు బక్క సాయిబాబా బుధవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో చేగుంట పట్టణశాఖ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


రామక్కపేటలో ప్రచారంలో భారీగా పాల్గొన్న జనం


సెల్ఫీలు దిగుతున్న యువతులు


నర్లెంగడ్డలో ప్రచారంలో ఎమ్మెల్యే రఘునందన్‌రావు

ఎన్నికల సిత్రాలు

లంబాడీల నృత్యం.. చేకూరాలి విజయం



నంగునూరు(సిద్దిపేట): కేసీఆర్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు ప్రతీ ఇంటికి చేరాయని జెడ్పీటీసీ ఉమ, మాజీ ఎంపీపీలు శ్రీకాంత్‌రెడ్డి, సారయ్య, మల్లయ్య, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు లింగంగౌడ్, సోమిరెడ్డి అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా బుధవారం దర్గపల్లి, జేపీ తండా గ్రామాల్లో పార్టీ నాయకులు ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా లంబాడి మహిళలు స్వాగతం పలికి నృత్యం చేశారు. కార్యక్రమంలో బాలయ్య, భిక్షపతి నాయక్, జ్యోత్స్న, మహిపాల్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

తల్లీ.. కారుకు ఓటేయాలి మళ్లీ



సిద్దిపేటజోన్: అమ్మా.. తల్లీ రెండు చేతులు పెట్టి దండం పెడుతున్న.. హరీశ్ రావు సారును మర్చిపోవద్దు.. మళ్లీ భారీ మెజార్టీ ఇవ్వాలని మున్సిపల్ మాజీ చైర్మన్ రాజనర్సు బుధవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు.

కారు గాలి వీచే వరకు..



చిన్నకోడూరు(సిద్దిపేట): మండలంలోని మైలారంలో బీఆర్‌ఎస్‌కు మద్దతుగా పార్టీ మహిళా విభాగం నాయకురాలు రాజశ్రీ,, ఏఎంసీ చైర్మన్ కొండం వనిత వాహనాలకు టైర్‌లలో గాలి నింపి కారు గుర్తుకు ఓటేయాలని అభ్యర్థించారు.

అవ్వా.. ఆశీర్వదించు



నారాయణఖేడ్: సిర్గాపూర్ మండలం బొక్కస్‌గాం, నల్లవాగు గ్రామాల్లో కాంగ్రెస్ అభ్యర్థి పట్లోళ్ల సంజీవరెడ్డి బుధవారం ప్రచారం చేస్తూ వృద్ధులను ఆప్యాయంగా పలకరిస్తూ తనను ఆశీర్వదించి గెలిపించాలని కోరారు.

ఇస్త్రీ చేస్తూ.. ఓటు అభ్యర్థిస్తూ



నర్సాపూర్: బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి సునీతారెడ్డి బుధవారం పట్టణంలో ప్రచారం నిర్వహించారు. ఇందులో భాగంగా ఓ లాండ్రీ దుకాణం వద్దకు వెళ్లి ఓట్లు అభ్యర్థించారు. కాసేపు ఇస్త్రీ చేసి తనకు ఓటు వేసి గెలిపించాలని కోరారు.